

# వెలిగించిన దీపం వెన్నెల కాదు

కాలం కరిగి.. కరిగి... గడ్డకట్టి, సుప్త సౌందర్యంతో ఢీకొట్టి... ఆకాశపు అంచుల మీద ఓ సుందర స్వప్నంగా తళుక్కుమంటే చురుక్కున కాలి, తనువు మధురదీప్తితో వెలిగిపోతే .. కాంతిపూలు కడుపులో విచ్చుకుని, అనంత విశ్వమూ తన భారాన్ని ఆమెలోకి నెట్టివేస్తే మోసి—మోసి. అలిసి... సొలిసి... ఇక మోయలేక, ఆ భారాన్ని జార

కె.కె. మీనన్

విడిచి ఆయాసం తీర్చుకుంది శ్యామల.

ఇప్పుడు ఆమె దించుకున్న భారం నిన్నటి ప్రణయ స్వప్నాల ఫలం. ఆ ప్రణయ స్వప్నాల నయాగరా ఆశల శిఖరాలమీంచి జారి, శూన్యంవైపు పరుగెత్తి... పాతాళంలో పడి, పగిలి.. అలలుగా విస్తరించుకుని, జీవిత సరితగా భావివైపు పరిప్లవిస్తోంటే—

"పాప " అని చెప్పింది నర్స్.

ఆమె వినగలిగింది. విని, మత్తులోనే సన్నగా నవ్వుకున్నది. ఆ నవ్వులో వేయి వసంతాల భావి కోటిరంగుల హరివిల్లులా విచ్చుకుంది.

తన కలలు కరిగి రక్తంలో కలిసి, కండలతో పెరిగి, తనలోంచి జారి, రూపు కట్టిన వెన్నెల వెలుగు ముద్దగా-పాప పక్కలో నిద్దరోతుంటే— కమ్మగా చూడాలని కను రెప్పలు తీసింది. కాని—వుహూ . ఆకాశంలోకి ఎగరాలనుకుంటోన్న తన్ను ఆకర్షణ శక్తి, భూగోళానికి కట్టిపడేసినట్టు. హిమాలయాలు. అల్ప్స ఏవేవో భూధర మహాధరాలు కనురెప్పలకు ముడిపడినట్టు, బరువుగా లేవటం లేదు. లేచినా కోటి నక్షత్రాల కాంతి కంటిరెప్పల దగ్గిర కాపలా వున్నట్టు నిబ్బరంగా వుంది.

కళ్ళు మూసుకుంది గట్టిగా.

మళ్ళీ ప్రారంభం—

బంగారు వన్నె వుంగరాల జుట్టు బొద్దుగా. . ముద్దుగా అడుగులు వేసుకుంటూ, తన ముందుకు పరుగెడుతున్నట్టూ—'అమ్మా' అని మెడని కావిలించుకున్నట్టూ— తను ఒళ్ళోకి తీసుకుని, ఒళ్ళంతా ముద్దులతో నింపేసి పెదాలతో తడిమేసి, తడిపేసి, కడిగేసి; తన మురిపాన్ని తీర్చుకుంటున్నట్టూ వూహ—

ఆ వూహలోనే మళ్ళీ మత్తులోకి జారిపోయింది శ్యామల.

* * *

ఉదయం లేచేటప్పటికి ఒంటిమీది బరువంతా జారి తేలికయినట్టనిపించింది. కళ్ళు తేలికగా అనాయాసంగా లేస్తున్నాయి. సుప్త చైతన్యం రెక్క విప్పిన చప్పుడు పక్కలోని పాప ఏడుపు.

పక్కకు తిరిగింది.

—అది మానవుడు, మర్కటం, పిగ్మీ.... రాక్షసులు కెవ్వున అరిచి కళ్ళు మూసుకుంది.

కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ ఏడ్చింది. తల మంచానికేసి కొట్టుకుంది. చర్మం చిట్లి, నెత్తురు బొట్లుగా పక్కమీద రాలింది.

చూసి పరుగెత్తుకెళ్ళింది నర్స్.

"డాక్టర్! ఆమెకు ఫిట్సులా వుంది" అని చెప్పింది.

డ్యూటీ డాక్టరొచ్చి చూసింది.

"గివ్ పెథడ్రిన్. "

ఇంజక్షనిచ్చింది సిస్టర్.

మళ్ళీ మత్తు ....

* * *

హాస్పిటల్లోంచి ఒక బేబీ అదృశ్యం.... తండ్రి ఫిర్యాదు— అసెంబ్లీలో అల్లరి— ప్రభుత్వం ఓ సంఘాన్ని నియమించిన వైనం హాస్పిటల్ ఆయా పాపను ఎత్తుకుపోయి చంపినట్టు సమాచారం . రుజువు.

కలగలుపుగా కోర్టులో కేసు విచారణ.

—నల్లకోట్లు, నల్లగౌన్లు—జరిగే అన్యాయాలకి, తెల్లజైలు ఎప్పుడో అక్కడక్కడా జరిగే ఓ అన్యాయానికి ప్రతీకలుగా అన్యాయ పండితులంతా అక్కడక్కడా - చర్చలు, గుసగుసలు. చెట్లకింద సంప్రదింపులు .. లోపలికెళ్ళబోయే ముందు—తృప్తి. .. అసంతృప్తి అక్కడ.

లోపల—

"ప్రభుత్వం వారి నివేదికను బట్టి నువ్వే బిడ్డను అపహరించి, చంపేసి, పాతిపెట్టినట్టు తేలింది. నిజమేనా?"

ప్రభుత్వ న్యాయవాది ప్రశ్న.

"నిజమే దొరా. " బోనులో ఆయా (ముద్దాయి నెం. 1) జవాబు.

"ఎందుకని?"

"ఆ యమ్మే ఆ బిడ్డను కన్నతల్లే.... చంపెయ్యమని పోరు పెట్టింది. నేనూ పిల్లలు

గలదాన్నే. ఎట్లా సంపగల్ను? అయినాగాని పేదముండని గనుక, డబ్బూ, బంగారం.... చూపెట్టి ఆశపెడితే లొంగిపోయాను....ఒడ్ల గింజేసి....సంపేసి....పాతేసాను... "

"నోట్....యువరానర్....మర్డర్....కోల్డ్ బ్లడెడ్ మర్డర్."

"ఊ .. రెండో ముద్దాయిని హాజరు పెట్టండి."

—శ్యామలా.... రెండో ముద్దాయి శ్యామలా........

ఆమె వచ్చింది. వచ్చి సర్వం కోల్పోయిన విరాగిణిలా నిర్వికారంగా బోనులో నిలబడింది. ఆమె ముఖం వాచి, కళ్ళు ఎర్రగా, రెండు చింతనిప్పులు పొదిగినట్టుగా వుంది. ఎన్నాళ్ళ నించో సంస్కారం ఎరక్క; పీచుగట్టి, ఎరుపు తిరిగిన జుట్టు ముఖం మీదికి ఎగురుతోంది.

ప్రభుత్వ న్యాయవాది ప్రశ్నలు మొదలెట్టాడు.

"మొదటి ముద్దాయి వాంగ్మూలం ప్రకారం పసిబిడ్డని చంపమని మీరే ఆమెను నియమించినట్టు అర్థం అవుతోంది.. అందుకు మీ సమాధానం?"

మౌనం.

"చెప్పాలి...."

ఆమెలో ఎలాంటి చలనం లేదు. ముఖం నేలవైపు వాల్చి పాదాలు చూసుకుంటోంది.

"ఒక తల్లి తన కన్నబిడ్డనే హత్య చేసిందంటే, మా దృష్టిలో రెండే రెండు కారణాలున్నాయి. దారిద్ర్యంతో బిడ్డని సాకలేని నిస్సహాయతవల్ల.... లేదా.... మరో వ్యక్తితో దైహిక సంబంధాలు పెట్టుకుని. ."

"ఆపండి...." ఆమె గట్టిగా అరిచి ముఖం పైకెత్తి ఒక్కసారి ప్రాసిక్యూటరు వైపు చూసింది. చెంపలమీంచి కన్నీళ్ళు ధారలు కడుతున్నయ్.

"ఈ అభియోగానికి నా అభ్యంతరం యువరానర్...." ముద్దాయి తరపు న్యాయవాది లేచి నిలబడ్డాడు.

"అభ్యంతరాన్ని అంగీకరిస్తున్నాం " న్యాయమూర్తి వత్తాసు.

"కోర్టువారూ, ముద్దాయీ, వారి న్యాయవాదీ అంతా నన్ను క్షమించాలి. ఇది నీచాభిప్రాయంతో చేసిన అభియోగంకాదు. ముద్దాయి నించి సమాధానం రాబట్టడం కోసం చేసిన ప్రయత్నం. ఇదో ఎత్తుగడ...."

ప్రభుత్వ న్యాయవాది క్షమాపణ తెలుపుకున్నాడు.

"ఆల్‌రైట్. ..కేరీ ఆన్. .."

"ఇప్పుడు చెప్పండి."

"ఏం చెప్పమంటారు?" ముద్దాయి జవాబు ప్రశ్న.

"మీరు చదువుకున్నవారు. ఉన్నత సమాజంలో పెరిగి ఎంతో కొంత సంస్కారాన్ని పెంచుకున్నవారు....జరిగింది జరిగినట్టు చెప్పి న్యాయస్థానంతో సహకరించండి."

"ఆయా చెప్పింది అక్షరాలా నిజం...."

"అలా ఎందుకు చేశారు?"

"కన్నతల్లే తన బిడ్డను చంపమని లంచం ఇచ్చి మరీ బతిమాలుకుందంటే .. అది ఎంతటి దుస్థితిలో చేసిందో వూహించుకోలేరా?"

"ఇది న్యాయస్థానం. ఇక్కడ వూహాగానాలకి తావు లేదు."

"తల్లి కావాలని ప్రతి ఆడదీ కోరుకుంటుంది. ముఖ్యంగా అది ప్రథమ సంతానం అయినప్పుడు - ఆ పుట్టబోయే బిడ్డ గురించి ఎన్ని కలలు కంటుందో. .ఎంత అందంగా ఆ బిడ్డను వూహించుకుంటుందో మీకు తెలీదు. తీరా పుట్టేక అది....అది...."

ఇక చెప్పలేక వెక్కి వెక్కి ఏడుస్తూ వుండిపోయింది.

"యువరానర్! అదీ అసలు కారణం...." అంటూ అందుకున్నాడు ఆమె తరపు న్యాయవాది.

"ఈ అమ్మాయి తన పుట్టబోయే బిడ్డ ఎంతో అందంగా వుండాలనీ, ఆరోగ్యంగా పెరగాలనీ కలలు గన్నది. అయితే ఆమెకు జన్మించిన బిడ్డ కురూపి, పెద్ద తల, పొట్టి చేతులు, పొట్టి కాళ్ళూ, బానపొట్ట. ."

"అబ్బా! ఆపండి. .ఇంక చెప్పకండి . . నన్ను చిత్రవధ చేయకండి. . ." అంటూ పిచ్చిగా అరిచింది శ్యామల.

*　　　*　　　*

". పైన చెప్పిన కారణాలు, వాంగ్మూలాలు దృష్టిలో వుంచుకుని ముద్దాయిలిద్దర్నీ శిక్షార్హులుగా నిర్ణయించటమైంది. ఐ. పి. సి . సెక్షన్ల కింద వీరిద్దరికీ ఆజన్మ కఠిన శిక్ష విధించడమైంది..."

న్యాయమూర్తి తన న్యాయనిర్ణయాన్ని చదివి ముగించాడు.

"నాదో చిన్న కోరిక " శ్యామల విన్నవించుకొంది.

"అనుమతించడమైంది."

"వ్యక్తి తన సామాజిక బాధ్యతల్ని విస్మరించకుండా, నైతిక విలువల్ని కాలదన్నకుండా, సంఘంలోని తనతోటి మనిషికి అక్రమం, అన్యాయం తలపెట్టకుండా సమాజం ఏర్పరుచుకున్న భద్రతే చట్టం. . .ఆ చట్టాన్ని అమలుపర్చటానికి నియమించిన సంస్థే న్యాయస్థానం...."

"యస్ ...కేరియాన్. "

"సమాజం అతి శీఘ్రంగా మారుతోంది. నైతిక విలువలు అంతకంటె వేగంగా మారుతున్నాయి. కానీ ఆ మార్పుకు అనుగుణంగా న్యాయం, చట్టం మారటం లేదు."

"నువ్వు చెప్పదల్చుకున్నదేమిటో నాకు అర్థమైంది. నేను న్యాయసూత్రాలకి బద్ధుణ్ని. న్యాయశాస్త్రాన్ని అతిక్రమించి ఏమీ చేయలేని అసమర్థుణ్ని."

"మీరు మీ వ్యవహారాలని మీకున్న పరిధుల్లోనే నిర్వహిస్తున్నారు. కాదనను. .. కాని ఆ పరిధులు పెంచాలి."

"అదంత తేలిక కాదు."

"అంతకంటే ఎంతో వున్నతమైన భారత రాజ్యాంగమే ఎన్నో మార్పులకు గురువుతోంది. ప్రజలకు అవసరం వున్నా లేకపోయినా రాజకీయాలకు అనుగుణంగా....నాయకుల అవసరాలకు సరిపడేట్టుగా సవరించబడుతోంది. అలాంటప్పుడు సమాజాన్ని సంరక్షించటానికి పుట్టిన న్యాయం అందుకు అర్హం కాదా?


"ఇది నా నేరాన్ని కప్పిపుచ్చుకోటానికి అనేమాట కాదు. నేను నేరం చేశాను. మీరు విధించే శిక్ష శిరసావహించటానికి సిద్ధంగా వున్నాను. కాని....ఇంతకు ముందు తమ కన్న బిడ్డల్నే కడుపున పెట్టుకో సిద్ధపడే అనేక మంది అభాగినుల ప్రస్తావన తెచ్చేరు ప్రాసిక్యూటరుగారు. కనీసం అలాంటి అభాగ్యుల కోసమయినా—వాళ్ళు ఆ పరిస్థితికి దిగజారటానికి సాయపడిన సామాజిక కారణాలేవిటి? వాళ్ళు ఎందుకు చేస్తున్నారు? అనైనా విచారించని న్యాయం న్యాయం కాదు. అన్యాయమే."

న్యాయమూర్తి అసహనంగా ముఖం చిట్లించాడు.

"ఇంకేమైనా చెప్పేది వుందా?"

"ఉహూ ...ఇంకేం లేదు. సమాజావసరాలకి అనుగుణంగా చట్టం న్యాయం సవరించబడాలన్నదే నా కోరిక."

"ఊఁ ఆమెను అవతలికి తీసుకుపొండి." □



"నా చిత్రలేఖనానికి "ఇన్‌స్పిరేషన్" మావిడేనోయ్!!"